# అడల్ట్స్ ఓన్లీ కథ



అప్పటికి నెలరోజులయిందేమో శశాంకకు, కళ్యాణికి వివాహం జరిగి. పెళ్ళిచూపుల్లో కళ్యాణిని చూసి తన కలల రాణి, వెన్నెల వెలుగు, ఆశల ఆమని అని ఉప్పొంగిపోయి, వాళ్ళిచ్చే కట్నం తన తల్లిదండ్రుల ఆశలకి సరితూగకపోయినా, ఆ పిల్లని చేసుకుంటాను అని తెగేసి చెప్పి నిరాహారదీక్ష కూడా చేసి సాధించాడు.

పెళ్ళి ముహూర్తాలు పెట్టినప్పటినుంచి కాళ్ళు నేలమీద నిలబడకుండా- గాల్లో లేచి కళ్యాణి చుట్టూ తిరగసాగాయి. ఆత్రుత ఆపుకోలేక మధ్యమధ్యలో ఫోన్ చేసినా ఎక్కువగా అత్తగారో, మరదలో మాట్లాడటమే కానీ, తన కాబోయే భార్య ఊ, ఆ అనటమే గానీ- ఉత్సాహంగా ఒక్కమాట కూడా మాటాడేది కాదు. అదంతా సిగ్గు అనుకున్నాడు శశాంక.

పెళ్ళి ఘనంగా చేశారు మావగారు. తన భార్య అందాన్ని, తన స్నేహితులంతా తెగ పొగిడారు ''ఒరేయ్, గురుడికి ఇంక ప్రతీరాత్రి శివరాత్రేరా'' అంటూ. హాస్యాలతో నవ్వించారు. ప్చ్! ఏం లాభం, తన జీవితంలో కళ్యాణ రాగం పలికిందికాని, మోహనరాగం ఆలపించలేదు ఇంకా!


తొలిరేయి గురించి ఎన్ని కలలు కన్నాడు. ఊహల్లో తేలిపోయాడు. రాబోయే ప్రణయ సామ్రాజ్యానికి తానే మన్మథుడయి, కళ్యాణి, రతీదేవి అని కలలు కన్నాడు!

ఆ రాత్రి తనకి, కళ్యాణికి తొలిరేయి ముహూర్తం నిర్ణయించారు. తన గుండె ఆనందంతో, పరవశంతో, నిముషానికి ఏ రెండువందలసార్లో కొట్టుకుంటున్న ఫీలింగ్.

రాత్రి అయింది. అంతా చేరి చేసే హడావిడి అంతా చేసి, కళ్యాణిని గదిలోకి పంపారు! తెల్లని పాల నురుగులాంటి చీర, చేతిలో పాలగ్లాసు, జడలో జాజులు, మరువం కలగలిపి కట్టిన మాల- మెడలో పచ్చగా మెరిసే పసుపుతాడు, కాలికి తెల్లగా మెరుస్తోన్న మెట్టెలు... సిగ్గు బరువుతో, తలవాల్చి, తలవాకిట నిలిచిన తన భార్యని చూసి, పరవశంతో మంచం పైనించి లేచి, ఎదురెళ్ళి ఆమె చేయి అందుకుని, ''రా కళ్యాణి'' అంటూ తీసుకొచ్చాడు!

నెమ్మదిగా భర్త చేయి విడిపించుకుని, చేతిలో పాల గ్లాసు అతనికి అందించి దూరంగా నిలబడింది!

''కూర్చో కళ్యాణి'' అంటూ భార్య చేయిపట్టి మంచంపై కూర్చోపెట్టాడు. తాను రెండో పక్కగా కూర్చుని, ''కళ్యాణి ఏమయినా కబుర్లు చెప్పు'' అన్నాడు ఆమె బెరుకు పోగొట్టాలని.



**కాకరాల భానుమతి**

ఆమెనించి ఏం సమాధానం లేదు. తలవంచుకుని, చేతులు ఒళ్ళో వేసుకుని, ఎర్రగా పండిన గోరింటాకుని అదే పనిగా చూసుకుంటోంది.

శశాంక ఆమె దగ్గరగా జరిగి, ఆమె భుజం పై చేసి వేసి, ''గోరింటాకు బాగా పండింది కదూ'' అన్నాడు.

''ఊ'' అని తల ఊపింది కానీ, నోరు తెరిచి సమాధానం ఇవ్వలేదు.

'బాగా బిడియస్తురాలులా ఉంది' అనుకుని, తనే ఇంకా దగ్గరగా జరిగి ఆమె చెంపపై చేయివేసి సుతారంగా నిమిరాడు.

చెంపపై ఏదో పురుగు పాకినట్లుగా, కొంగుతో చెంపని తుడిచేసుకుంది. ఆశ్చర్యపోయాడు శశి. తనంటే ఇష్టంలేకుండా బలవంతంగా చేశారేమో అనే అనుమానం వచ్చింది.

''నేనంటే ఇష్టంలేదా'' అన్నాడు.

''ఇష్టమే'' అంది తల ఊపి!

''మరి చేయివేస్తే అలా కొంగుతో తుడిచేశావ్'' అన్నాడు.

''ఆ, అవును. మగాళ్ళని దూరంగా వుంచాలని, వాళ్ళు మంచివాళ్ళు కాదని, మా అమ్మమ్మ చెప్పింది'' అంది అమాయకంగా చూస్తూ.

''అహా..అలాగా'' అని ''మీ తాతయ్య దుర్మార్గుడా'' అన్నాడు.

''ఏం కాదు, చాలా మంచివాడు'' అంది మొదటిసారిగా నోరు విప్పి.

''మరి మీ అమ్మమ్మ అలా ఎందుకు చెప్పింది'' అన్నాడు.

''ఏమో, నాకేం తెల్సు'' అని, నాకు ''నిద్ర వస్తోంది'' అంటూ ఆవలించింది.

''నిద్రపో'' అన్నాడు ఇంక ఈరోజుకి ఆమె దారికి రాదని అనుకుంటూ.

ఒక పక్కకి తిరిగి పదినిమిషాల్లో హాయిగా నిద్రపోయింది.

నిద్రరాక, 'ఏం చేయాలి ఈమెని' అని ఆలోచనలతో- ''ఒసే అమ్మమ్మా, పెళ్ళి అయే పిల్లకి, ఇలాంటివి చెప్తావుటే'' అంటూ కళ్యాణి అమ్మమ్మని తెగతిట్టుకుంటూ- ఏ తెల్లవారురఝామునో నిద్రపోయాడు శశాంక.

★ ★ ★

ఆఫీసులో పరధ్యానం ఎక్కువయింది శశాంకకు.

తోటివాళ్ళు హాస్యాలాడారు. ''పెళ్ళి చేసుకున్నాక, నీకు పరధ్యానం ఎక్కువయింది ఏమిటోయ్'' అంటూ.

నవ్వేసి ఊరుకున్నాడు. తన బాధ ఎవరితో చెప్పుకుంటాడు. భార్య అన్నీ చక్కగా సపర్యలు చేసింది. ఏ లోటూ లేదు, ఆ ఒక్కటీ తప్ప.

సినిమాలు, షికార్లు, అన్నింటికి సరదాగా వస్తుంది. కానీ రాత్రి అయేసరికి దగ్గరకు వెళితే మాత్రం దూరం జరుగుతుంది. ఈ వింత ప్రవర్తన ఏమిటో ఆశ్చర్యంగా ఉంది అతనికి.

ఆరోజు అతని ఫ్రెండ్ భాస్కరం వాళ్ళింటికి ఆహ్వానించాడు. సాయంత్రం భార్యాభర్తలు ఇరువురు వాళ్ళింటికి వెళ్ళారు.

కొత్తగా పెళ్ళి అయిన జంట కదా అని, భాస్కరం, భార్య, జ్యోతి, కళ్యాణిలో ఏవేవో హాస్యాలాడితే, కళ్యాణి మొహం చిటపటలాడించుకుని, టాపిక్‌ని మార్చింది! జ్యోతి ఆశ్చర్యపోయింది.

అక్కడ కబుర్లలో భాస్కరం శశాంక నుంచి మెల్లిగా అసలు విషయం కనుక్కున్నాడు.

మొదట ఇంటి విషయాలు చెప్పటానికి మొహమాట పడ్డాడు. ''ఏం ఫర్వాలేదు నేను ఎవరితో చెప్పనురా..'' అని భాస్కరం బలవంతం చేస్తే అసలు సంగతి చెప్పాడు.

అంతా విని, అతను ''చాలామంది ఆడపిల్లలు మొదట్లో బిడియంగా ఉంటారు. కానీ, ఇదేంటి మీ ఆవిడ మరీ చిత్రంగా ఇన్నిరోజులయినా ఇంకా ఇలా ఉండటం, కట్టుబాట్లు, సంప్రదాయాల మధ్య పెరిగిన పిల్లకదా. అందుకని అలా ఉంది అంతే. మరి భయపడకు, మేం మారుస్తాం మీ ఆవిడని, చూడు'' అన్నాడు.

''ఎలా'' అన్నాడు ఆశ్చర్యంగా.

''అదే సీక్రెట్ మరి'' అని నవ్వి, వన్‌మినిట్ అని లోపలికి వెళ్ళి జ్యోతిని పిలిచాడు, అందరికీ కాఫీలు తయారుచేస్తూ కబుర్లు చెప్పుకుంటున్న భార్యని. కళ్యాణి దగ్గరకు వచ్చాడు.

''ఏంటండీ'' అంది కప్పుల్లో కాఫీ పోస్తూ!

''ఆ పని ఆవిడకి చెప్పు, ఇలా రా నువ్వు'' అన్నాడు.


''ప్లీజ్ ఏమీ అనుకోకు కళ్యాణి, కొంచెం ఈ కాఫీని కప్పుల్లో పోస్తారా'' అంది.

''అలాగే మీరెళ్ళండి'' అంది.

పక్క గదిలోకి వెళ్ళి భార్య భుజంపై చేయి వేసి దగ్గరగా లాక్కుని, చెవిలో ఏదో గుసగుసలాడాడు.

గది కిటికీలో నుండి ఆ దృశ్యం కళ్యాణికి కనిపిస్తోంది. ''ఛీ..ఛీ..ఇంట్లో స్నేహితుడలుంటే వీళ్ళు గదిలో చేరి అలా పోజులు.. ఆ గుసగుసలు ఏంటో సిగ్గు లేకుండా'' అని అనుకుంది.

అంతా కాఫీలు తాగారు ఆ తర్వాత!



## ఐటెం గర్ల్ యానా!

**సినిమాల్లో మామూలు పాటలకంటే ఇప్పుడు ఐటెం నెంబర్ సాంగ్స్‌కి ప్రాధాన్యత బాగా పెరిగిపోతోంది. ఐటంనెంబర్ గర్ల్‌గా పేరుతెచ్చుకుంటోంది యానాగుప్తా. ఈ భామ మళ్ళీ మరికొన్ని తెలుగు, తమిళ చిత్రాల్లో కన్పించడానికి తెగ ప్రయత్నాలు చేస్తోంది. సెక్సీగా కన్పించడానికి ఏమాత్రం వెనుకాడని ఈభామ శంకర్ కొత్త చిత్రం అపరిచితుడులో కన్పించనుంది.**

''మేం వెళ్ళొస్తాంరా'' అన్నాడు శశాంక.

కళ్యాణికి బొట్టుపెడుతూ, ''కళ్యాణిగారు, ఈ పుస్తకంలో కథలు చాలా బావుంటాయి, పట్టుకెళ్ళి చదవండి'' అంటూ ఒక బైండులా ఉన్న పుస్తకం ఇచ్చింది.

''ఏంటి'' అని అట్ట తెరవబోయింది.

''ఆ..ఆ..ఇక్కడ కాదు, మీ ఇంటికెళ్ళి తీరిగ్గా చదువుకోండి'' అంది నవ్వుతూ.

''సరే'' అంటూ ఆ పుస్తకం భర్త చేతికి అందించింది కళ్యాణి.

ఇరువురు బయలుదేరి ఇంటికి వచ్చి, భోజనాలు చేసి పడుకున్నారు.

★ ★ ★

మరునాడు పని అంతా చేసుకుని పడుకుందామని నడుం వాల్చిన కళ్యాణికి ఎదురుగా బల్లపై జ్యోతి ఇచ్చిన పుస్తకం కనబడింది.

''ఏమిటో చూద్దాం. అంత గొప్ప పుస్తకమా ఇది'' అనుకుంటూ పుస్తకం పట్టుకుని మొదటి పేజీ తిరగేసింది.

పుస్తకంపై ప్రత్యేకంగా జ్యోతి రాసిన పేరు చూసి ''ఛీ..ఛీ'' అనుకుని పుస్తకం విసిరేయబోయింది. మళ్ళీ ఆసక్తిగా అందులో ఏం ఉందో చూద్దాం అనుకుని, చదవసాగింది.

ఒకో కథా చదువుతుంటే, ఆమె ఒళ్ళు కొంచెం కొంచెం వేడెక్కసాగింది. సాయంకాలం అయిదయింది, పుస్తకంలో కథలన్నీ పూర్తిచేసేసరికి!

కళ్యాణికి ఒళ్ళంతా మత్తు. ఏదో శరీరానికి కావాలనే తపనతో అదోరకంగా ఉంది. అమ్మమ్మ ఏంటి అలా చెప్పింది. ఈ కథల్లో చూస్తే ఎంత చక్కగా ఉన్నారు మగాళ్ళు. ఎంత రసికులు, ఎంత మంచివాళ్ళు. భార్యని ఎంత అపురూపంగా, అతి సుకుమారంగా చూస్తున్నారు. తాను ఇన్నాళ్ళు భర్తని ఎంత బాధించిందో అర్థం అయింది. తన భర్త మంచివాడు. తానంటే ప్రేమ, ఇష్టం ఉన్నవాడు కాబట్టే, సహనంగా తనలో మార్పు కోసం ఎదురు చూస్తున్నాడు అనుకుంది.

గాల్లో తేలిపోతున్నట్లుగా ఉంది, ఒకో కథా చదువుతుంటే! సాయంత్రం వంట పూర్తిచేసింది. చక్కగా స్నానం చేసి పెళ్ళిలో శోభనం నాడు అత్తవారు పెట్టిన తెల్లని జరీ చీర కట్టింది. పూల అమ్మాయి దగ్గర మల్లెలు, జాజులు, గులాబీలు కొని, తమ గదిలో మంచం అంతా అందంగా అలంకరించి భర్త రాకకై ఎదురుచూస్తూ కూర్చుంది.

రాత్రి ఎనిమిది దాటింది. శశాంక రాలేదు. కళ్యాణి గుండెల్లో గుబులు, ఏంటి ఇంకా రాలేదు అని. ఇంతలో ఫోన్ మోగింది. గభాల్న వెళ్ళి ఫోన్ తీసి ''హలో'' అంది కంగారుగా!

''ఆ కళ్యాణి.. ఈరోజు రావటం లేటవుతుంది. నువ్వు భోం చేసి పడుకో..'' అన్నాడు అవతల నుంచి భర్త.

''ఏం ఎందుకు'' అంది కంగారుగా. స్నేహితులంతా సెకండ్ షో సినిమాకి రమ్మన్నారు. వెళుతున్నాం'' అన్నాడు.

''వద్దండీ. మీరు ఇంటికి వచ్చేయండి'' అంది గొంతులో రవ్వంత దుఃఖం పొంగుతోంది.

''ఏం కళ్యాణి, ఏమయింది'' అన్నాడు గాభరాగా!

''నాకు, నాకు జ్వరంగా'' ఉంది అంది ఏమనాలో కంగారులో తెలీక!

''అయ్యో, అలాగా, అయితే వచ్చేస్తాను. జాగ్రత్త, రాగానే డ్వాక్టరుకి చూపిస్తాను. భయపడకు'' అన్నాడు.

''అలాగే'' అంటూ ఫోన్ పెట్టేసింది.

★ ★ ★

పదిహేను నిమిషాల్లో భర్త స్కూటరు చప్పుడు విని, వీధి తలుపు తీసి, తను గభాల్న వెళ్ళి మంచంపై వాలి ముసుగు పెట్టింది.

''కళ్యాణి ఎలా ఉంది'' అంటూ వచ్చి నుదుటిపై చేయి వేసి చూసి, ''ఏం జ్వరంలేదే, బాగానే ఉంది'' అన్నాడు.

''ఆ..ఇప్పుడు కొంచెం నయం'' అని ''మీరెళ్ళి స్నానం చేయండి. అన్నం వడ్డిస్తాను'' అంది.

''డ్వాక్టరు దగ్గరకు వెళదాం'' అన్నాడు.

''అబ్బా, ఇప్పుడు కొంచెం నయం అన్నాను కదా. మీరెళ్ళండి'' అంది.

''సర్లే నీ ఇష్టం, వినవుకదా'' అనుకుంటూ బట్టలు మార్చుకుని, స్నానం చేసి, తెల్లని లుంగీ ధరించి, భార్యని పిలిచాడు. ''కళ్యాణి.. కొంచెం పాలు అయినా తాగుదువురా'' అని.

''నేను తర్వాత తాగుతాను. మీరు కానీండి'' అంది గదిలోంచే!

''సర్లే'' అని బల్లపై అన్నీ సర్ది ఉంచిన పదార్థాలని చూసి ఆశ్చర్యపోయాడు.

'జ్వరం అని ఇవన్నీ ఎలా చేసిందబ్బా' అనుకుంటూ భోజనం చేసి కాసేపు టీవీ చూసి పడుకోవటానికి తన గదిలోకి వెళ్ళాడు.

ఎప్పుడు లేచి వెళ్ళిందో కళ్యాణి.. చేతిలో పాల్గ్లాసుతో శోభనం పెళ్ళి కూతురిలా మంచం దగ్గర నిలబడి ఉంది!

ఆశ్చర్యపోయి- ''కళ్యాణి, ఏంటి ఇది. జ్వరం అని ఇంత ముస్తాబు అయ్యావు'' అన్నాడు దగ్గరగా వస్తూ.

ముసిముసిగా నవ్వుతూ- ''అవును- ప్రేమ జ్వరం- శృంగార జ్వరం'' అంటూ పాలు భర్తనోటికి అందించింది.

శశాంక ఆనందం, ఆశ్చర్యంతో నోటమాట రాక- నోరు తెరిచి భార్యకేసి చూస్తుండిపోయాడు!

''ఏమండోయ్ శ్రీవారు, ఏంటి అలా నోరెళ్ళబెట్టారు, కాస్త మూయండి'' అంది నవ్వుతూ.

''ఆ..ఆ..'' అని ఇహలోకంలోకి వచ్చి, ''అమ్మ దొంగా జ్వరం అని డ్రామా ఆడి, ఇదా నీ వేషం'' అంటూ భార్యని సుడిగాలిలా చుట్టేసి, ఉక్కిరిబిక్కిరి చేసాడు.

''అబ్బా! ఏంటి ఈ విపరీతం, కొంచెం వదలండి'' అంది భర్త కౌగిలిలో గిలగిలమని.

''ఆహా! ఇన్నాళ్ళూ నన్ను ఏడిపించావుగా'' అంటూ మరింత బిగించాడు కౌగిలిని.

అలిసిపోయి, తన ఎదపై వాలిన భార్య తల నిమిరి- ''ఏమిటి ఈ వింత. ఈరోజు నీ సిగ్గు, భయం అంతా ఏమయ్యాయి'' అన్నాడు.

''ఆ..కాకి ఎత్తుకెళ్ళింది'' అని కిలకిలా నవ్వుతూ- భర్త చేతుల నుండి తప్పించుకుని, లేచి పరుపు కింద దాచిన జ్యోతి ఇచ్చిన పుస్తకం చూపించి- ''రహస్యం అంతా ఇందులో ఉంది'' అంది.

''ఏమిటి అది, ఇది జ్యోతిగారు ఇచ్చిందేనా-'' అన్నాడు పుస్తకం అందుకుని. ''అవును ఆవిడే నా కళ్ళు తెరిపించారు, ఈ పుస్తకం ఇచ్చి'' అంది బట్టలు సరిచేసుకుని, భర్త పక్కగా కూర్చుంటూ!

''అంత జ్ఞానోదయం చేసిన ఆ పుస్తకం ఏంటబ్బా-'' అని భార్య చేతి నుంచి తీసుకుని ఆ పుస్తకం అట్ట తిప్పి చూసాడు.

అందమయిన చేతిరాతతో- 'సంసారానికి సరసమయిన కథలు' అని రాసిన అక్షరాలు చూసి లోపల కథలు చదవటానికి పేజీ తిప్పాడు. దాంట్లో అన్ని రకాల పత్రికల్లో పడిన శృంగార కథలున్నాయి.

''ఆ..ఆ..ఇప్పుడు కాదు. రేపు ఆఫీసు నుంచి వచ్చాక చదువుదురుగాని- అప్పుడే పన్నెండు అయింది'' అంటూ భర్త చేతిలో పుస్తకం లాగి పక్కకి విసిరేసింది.

ఆ గదిలో లైటు తీసేసి..భార్యని మరోసారి తన కౌగిలిలో బందీని చేసాడు శశాంక్.

★ ★ ★

తెల్లారి ఆఫీసుకి వెళుతూ ''కళ్యాణి..ఫోన్ చేసి జ్యోతిగారికి థేంక్స్ చెప్పు'' అన్నాడు.

అపురూపంగా భార్యని చూస్తూ ఆఫీసుకి బయలుదేరాడు.

మంచంపై వాలి, జ్యోతి ఇచ్చిన పుస్తకాన్ని మరోసారి చేతిలోకి తీసుకుని అందులో తనకి బాగా నచ్చాయని అనుకున్న కథలని తిరిగి చదువుతూ నిద్రలోకి జారింది కళ్యాణి.

★ ★ ★

సంవత్సరం తరువాత.. అందమయిన అమ్మాయిని కంది కళ్యాణి. వాళ్ళ అమ్మమ్మని తెగ తిట్టింది. పురిటికి వెళ్ళినప్పుడు కూతురి పేరు 'సరసు' అని పెట్టాడు భర్త.

''ఓసీ పిచ్చిమొహమా.. పరాయి మగాళ్ళకి దూరంగా ఉండు అన్నాను కానీ.. భర్తకు దూరంగా ఉండమన్నానా'' అంది ఆమె అమ్మమ్మ పగలబడి నవ్వుతూ!

☆